బానోత్ కృష్ణకు పీహెచ్‌డీ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ లింగ్విస్టిక్స్ విభాగం విద్యార్థి బానోతు కృష్ణకు పీహెచ్‌డీ డాక్టర్ డిగ్రీ లభించింది. విశ్రాంత అధ్యాపకులు ప్రొ.రమేష్‌కుమార్ పర్యవేక్షణలో ఎ ఫోనొలజికల్ స్టడీ ఆఫ్ లంబాడి అండ్ ఇంగ్లిష్ : ఎ డిస్క్రిప్టివ్ స్టడీ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు.

25న మహనీయుల జాతర

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 25న బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని రవీంద్ర భారతీలో మహనీయుల జాతర జరగనుంది. బుధవారం సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ విశ్రాంత అధ్యాపకులు ప్రొ. ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆట, పాట, మాటలతో జరిగే కార్యక్రమానికి బీపీ మండల్ మనువడు ప్రొ.ఊరజ్ మండల్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క హాజరుకానున్నట్లు చెప్పారు.

వీసీలను నియమించండి: ఏఐఎస్‌ఎఫ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాలకు తక్షణం వీసీలను నియమించాలని ఏఐఎస్‌ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య బుధవారం డిమాండ్ చేశారు. మూడు నెలలుగా వీసీలు లేనందున వర్సిటీల పరిపాలన కుంటుపడిందన్నారు.
సీఎం రేవంత్ రెడ్డికి ఇతర అంశాల పై ఉన్న శ్రద్ధ విద్య రంగం పై లేనదన్నారు. స్కిల్ వర్సిటీకి చట్టబద్ధత కల్పించి తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయాన్ని పక్కన పెట్టడం దారుణమన్నారు.

ఓయూలో మాల విద్యార్థుల నిరసన



నిరసన తెలుపుతున్న మాల విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీమ్ కోర్టు తీర్పును ఖండిస్తు దళిత సంఘాలు చేపట్టిన భారత్ బంద్‌కు ఓయూలో మాల విద్యార్థులు మద్దతు తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఆధ్వర్యంలో సుప్రీమ్ కోర్టు తీర్పును ఖండిస్తూ బంద్‌లో పాల్గొని నిరసన తెలిపారు. అంసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. మంచాల లింగస్వామి మాట్లాడుతూ కేవలం ఓట్ల కోసమే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరించి బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. కోర్టు తీర్పును పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాహుల్, సురేష్, శంకర్, గాజుల నవీన్, రఘు, సుధాకర్, మహేష్, రాకేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా గురువారం సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని గణపతి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం , అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం, హారతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని పేర్కొన్నారు.

సీనియర్ సిటిజన్లకు అవగాహన



ఉత్పత్తులను పరిశీలిస్తున్న రామకృష్ణ తదితరులు

రసూల్‌పురా: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ తిరుమలగిరి బంజారానగర్‌లో మొబిలిటి ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ల కోసం అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ /ానం, సంస్కృతి సంప్రదాయాలను ఒక తరం నుండి మరో తరానికి సీనియర్ సిటిజన్లు పంచుతున్నారని అన్నారు. సీనియర్ సిటిజన్ల కోసం మొబిలిటి ఇండియా వివిధ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. మొబిలిటి ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్, ఫిజియోథెరపిస్ట్ రాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రయాణికుడికి మరిచిపోయిన వెండి అందజేత



వెండి సామగ్రిని యజమానికి అందజేస్తున్న తుకారాంగేట్ ఎస్ఐ నరేష్

అడ్డగుట్ట: ఆటోలో ప్రయాణికుడు మరిచిపోయిన వెండి వస్తువులను పోలీసులు తిరిగి యజమానికి అప్పగించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. కిషోర్ కుమార్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి సికింద్రాబాద్ నుంచి తుకారాంగేట్‌కు 600 గ్రాముల వెండి సామాగ్రి ఉన్న బ్యాగుతో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో బ్యాగును ఆటోలోనే మరిచిపోయి దిగేశాడు. తన బ్యాగును మరిచిపోయానని ఆలస్యంగా గ్రహించిన కిషోర్ వెంటనే స్థానిక తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. వెంటనే పోలీసులు సీసీ కెమరాల ద్వారా ఆటోను గుర్తించి సదరు డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో అతను తన ఆటోలో ప్రయాణికుడు మరిచిపోయిన వెండి సామాగ్రి ఉన్న బ్యాగును తీసుకొని స్టేషన్‌కు వచ్చి అందజేశాడు.

కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలి



మంత్రి సీతక్కకు వినతి పత్రం అందచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మంత్రి సీతక్కకు పార్ట్‌టైం అధ్యాపకులు వినతి పత్రం సమర్పించారు. బుధవారం ఓయూ క్యాంపస్ న్యాయక శాలలో ఎల్‌ఎల్‌ఎం పరీక్షలకు హాజరైన మంత్రి సీతక్కను కలిసి వర్సిటీలలో పార్ట్ టైం అధ్యాపకులుగా పని చేస్తున్న వారిని కాంట్రాక్టు అధ్యాపకులగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. సోమేశ్వర్, డా.ఆరుట్ల జానకిరెడ్డి, భారతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల కోసం పాట్లు

కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

- ప్రజల నుంచి ధ్రువపత్రాల స్వీకరణ
- అన్ని వార్డు కార్యాలయాల్లో సేవలు



బన్సీలాల్‌పేట వార్డు కార్యాలయంలో దరఖాస్తుదారుల పత్రాలను స్వీకరిస్తున్న అధికారులు

సనత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనకు దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ముఖ్యంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం, 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకం వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించే గృహజ్యోతి పథకాలతో పాటు ప్రజాపాలనలో సూచించిన పథకాల కోసం సనత్‌నగర్ నియోజకవర్గంలో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ పథకాలను ప్రభుత్వం అమలుచేస్తుండగా ఆయా పథకాలకు చాలామంది సరైన పత్రాలు సమర్పించకుండా ఉండడంతో అనర్హులయ్యారు. అర్హత ఉండి కూడా సరిగ్గా దరఖాస్తు చేసుకోని కారణంగా ఆయా పథకాలకు దూరమయ్యారు. దరఖాస్తు చేసుకుని సరైన పత్రాలు సమర్పించని వారికి కూడా అర్హతను కల్పించేందుకు మరోసారి అలాంటి వారి నుంచి సంబంధిత పత్రాలను జత చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చే కార్యక్రమం కొనసాగుతుంది. వాస్తవానికి గత పార్లమెంట్ ఎన్నికలకు ముందే అధికారులు ఈ ప్రక్రియను మొదలుపెట్టగా ఎన్నికల కోవిడ్ రావడంతో అది కాస్తా నిలిచిపోయింది. గత నెల 22వ తేదీ నుంచి బేగంపేట సర్కిల్ కార్యాలయంతో పాటు వార్డు కార్యాలయాల్లో సంబంధిత ధృవపత్రాలను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. బేగంపేట సర్కిల్ పరిధిలోని బన్సీలాల్‌పేట, రాంగోపాల్‌పేట, బేగంపేట, మోండా డివిజన్లతో పాటు ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో ఆయా వార్డు కార్యాలయాల్లో నిరంతరాయంగా కొనసాగుతుంది. ప్రభుత్వం కూడా ఎప్పటివరకు దరఖాస్తు చేసుకోవాలని డెడ్‌లైన్ కూడా విధించకపోవడంతో పత్రాల స్వీకరణను కొనసాగిస్తున్నారు. పెద్ద ఎత్తున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి వస్తుండడంతో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న సమయంలో ఇచ్చిన ఫైల్ నెంబర్‌ను తాజాగా ఏర్పాటుచేసిన కౌంటర్లలో చూపిస్తే సదరు అధికారి వెంటనే ఆ ఫారాన్ని తెరిచి వివరాలను నమోదు చేస్తారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసినప్పటి రశీదు, రేషన్‌కార్డు, కుటుంబ యజమానురాలి ఆధార్‌కార్డు, 200 యూనిట్ల లోపు ఉన్న ఇంటి కరెంటు బిల్లు సమర్పిస్తే 10 నిమిషాల్లోనే ఆన్‌లైన్‌లో నమోదు పొందుపరుస్తున్నారు. వెంటనే ఆ రెండు పథకాలకు అర్హులుగా మారతారు. మళ్లీ ఈ సేవలను పునఃప్రారంభించడంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఏ డివిజన్ కౌంటర్లు ఎక్కడంటే..

- బన్సీలాల్‌పేట డివిజన్‌కు సంబంధించిన ప్రజలు అభయహస్తం దరఖాస్తుల వివరాలను కీస్‌బ్లాక్ కమ్యూనిటీహాల్‌లో స్వీకరిస్తున్నారు.
- రాంగోపాల్‌పేట డివిజన్‌కు సంబంధించి కేపీఎస్‌సీ ఎదురు వీధిలో గల ప్రభుత్వ పాఠశాలలో స్వీకరిస్తున్నారు.
- బేగంపేట డివిజన్‌కు సంబంధించి పాటిగడ్డ మోడల్ మార్కెట్ వద్ద తీసుకుంటున్నారు.
- మోండా డివిజన్‌కు సంబంధించి పరికిబస్తీ కమ్యూనిటీహాల్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేశారు.
- సనత్‌నగర్ డివిజన్‌కు సంబంధించి నెహ్రూపార్కులోని వార్డు కార్యాలయంలో స్వీకరిస్తున్నారు.
- అమీర్‌పేట డివిజన్‌కు సంబంధించి వివేకానందకమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసి స్వీకరిస్తున్నారు.

మహిళా ఉద్యోగులపై దాడులు అమానుషం



ర్యాలీ నిర్వహిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

అడ్డగుట్ట: మహిళ ఉద్యోగులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకర్‌రావు డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని కేంద్ర కార్యాలయం నుంచి రైల్ నిలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో జోనల్ మహిళ కోఆర్డినేటర్ సరోజిని రెడ్డి, ఏజీఎస్ ఉదయ భాస్కర్, రవీందర్, సంజీవయ్య, కృష్ణ, బుచ్చిరెడడి, ఖాజబాబ, వరప్రసాద్, మంజులత పాల్గొన్నారు.

అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి

అడ్డగుట్ట: అనారోగ్యంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. గొడవెళ్లి రైల్వే స్టేషన్‌లో బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో సుమారు 45–50 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఇది గమనించిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిక తరలించగా అనారోగ్యంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

అనుమానాస్పదస్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిలకలగూడ : అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, అడ్మిన్ ఎస్ఐ బాలరాజులు తెలిపిన మేరకు.. బోయిగూడ లోని క్యాథలిక్ సెమెట్రీ వద్ద ఓ వ్యక్తి రక్తపు మడుగులో పడిఉన్నట్లు బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. చిలకలగూడ పోలీసులు ఘటనస్తలానికి చేరుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీమార్చురీలో భద్ర పరిచారు. ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందినట్లు గుర్తించారు. ఎవరైన దాడి చేసి హత్య చేశారా, అనారోగ్య కారణాలతో మృతి చెందాడా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

ఫ్లెక్సీ కూలి ఇద్దరికి గాయాలు

సనత్‌నగర్: ఫ్లెక్సీ కూలి ఇద్దరు గాయపడిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బాలంరాయి చౌరస్తా సమీపంలోని వాటర్‌ట్యాంక్ వద్ద బీజేపీ నేతలు భారీ ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. బుధవారం ఉదయం ఫ్లెక్సీ ఒక్కసారిగా కుప్ప కూలిపోయింది. ఆ సమయంలో అప్పుడే అక్కడికి పానీపూరి బండిని తీసుకువచ్చిన జయసుధ అనే మహిళతో పాటు నిల్చున్న కొందరిపై ఫ్లెక్సీ పడడంతో స్వల్పంగా గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

మెకానిక్ ఆత్మహత్య



రాంగోపాల్‌పేట్: ఉరి వేసుకొని ఓ మెకానిక్ ఉరివేసికుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. రెజిమెంటల్ బజార్‌కు చెందిన శ్రీధర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొద్ది రోజుల నుంచి కల్లు తాగడం అలవాటు చేసికున్నాడు. రాఖీ పండుగ సందర్భంగా భార్య శాలిని పుట్టింటికి వెళ్లగా ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. బుధవారం ఉదయం శ్రీధర్ బావమరిది ఫోన్ చేయగా ఎంతకు సమాధానం ఇవ్వలేదు. దీంతో ఆయన ఇంటొ పక్కన ఉండే వాళ్లకు ఫోన్ చేయగా కిటికీలో నుంచి చూడగా ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానికులు గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసే సరికి చనిపోయి ఉన్నారు.

దోపిడీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

అడ్డగుట్ట: దోపిడీ కేసులో ఓ నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా రైల్వే కోర్టు విధించింది. సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన మేరకు.. 2022వ సంవత్సరం డిసెంబర్ నెలలో భార్యాభర్తలు అశోక్, కనకమహాలక్ష్మిలు నిజామాబాద్ నుంచి నగరానికి కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో నేపాల్‌కు చెందిన దినేష్ అజి(26) కనకమహాలక్ష్మి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కెళ్లే ప్రయత్నంలో సదరు మహిళ మెడపై దాడి చేయంతో పాటు అడ్డు వచ్చిన భర్త చాతిపై కత్తితో దాడి చేసి పారిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు నిందితుడు దినేష్‌ను అదుపులోకి తీసుకొని బుధవారం రైల్వే కోర్టులో హాజరుపరచగా ఏడాది పాటు జైలు శిక్షతో పాటు రూ. 200 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

అమీర్‌పేట: బల్కంపేటలో నివాసముంటునన ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ తన నివాసంలోనే మృతి చెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. నెల్లూరు జిల్లా సిద్ధిపురం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ (52) బల్కంపేటలోని సిరి ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాడు. హిమాయత్ సాగర్ సమీపంలోని జీవన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పనిచేస్తున్నాడు. ఆయన గదిలో నుండి దుర్వాసన రావడతంతో వాచ్‌మెన్ ధనుంజయ్ విషయాన్ని ఫ్లాట్ యజమాని మధుసూదన్‌గౌడ్‌కు తెలిపాడు. యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విజయ్ కుమార్ మృతి చెంది కనిపించాడు. ల్యాప్‌టాప్ ముందు కూర్చుని పనిచేసుకుంటూ మృతి చెందినట్లు గుర్తించారు. నాలుగైదు రోజుల క్రిందట మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు.


మురుగు సమస్య పరిష్కరించండి



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ : జలమండలి శ్రీనివాసనగర్ సెక్షన్ పరిధిలో మురుగునీటి సమస్యలపై తరుచూ ఫిర్యాదులు అందుతున్నాయని, తక్షణమే పరిష్కరించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. శ్రీనివాసనగర్ జలమండలి కార్యాలయంలో అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. పర్యవేక్షణ లోపంతో మంచినీటి లోప్రెషర్, మ్యాన్‌హోల్స్ పొంగి మురుగునీరు రహదారులు, ఇళ్లను ముంచెత్తుతున్నాయనే ఫిర్యాదులు అందుతున్నాయని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని, బ్రాహ్మణబస్తీ, వెంకటేశ్వరనగర్‌లలో ఆగిపోయిన అభివృద్ధి పనుల రీటెండర్‌కు ప్రపోజల్ పెట్టాలని సూచించారు. జలమండలి సెక్షన్ మేనేజర్లు ప్రియాంక, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు ప్రాధాన్యమివ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సర్ధార్దాసింగ్

రాంగోపాల్‌పేట్: రాబోయే వినాయక నిమజ్జన ఉత్సవాల్లో మంటపాల నిర్వాహకులు భక్తుల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని మహంకాళి ఏసీపీ సర్దార్‌సింగ్ సూచించారు. బుధవారం మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్సై గిరిధర్‌తో కలిసి ఆయన మంటప నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. గణపతులను సందర్శనకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎలక్ట్రికల్ కనెక్షన్ ఇచ్చే సమయంలో షార్ట్ సర్క్యూట్ లాంటి వాటితో ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రశాంతంగా అందరూ కలిసి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో 100 మంది వరకు నిర్వాహకులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లను పట్టించుకోండి



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన ఐడీహెచ్‌కాలనీ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల నివాసితులు

సనత్‌నగర్: శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉందని, తమను ఆదుకోవాలంటూ బన్సీలాల్‌పేట డివిజన్‌కు చెందిన జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల నివాసితులు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఐడీహెచ్‌కాలనీలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లకు చెందిన ప్రజలు బన్సీలాల్‌పేట బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు ఆధ్వర్యంలో వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. సుమారు 20 సంవత్సరాల క్రితం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకం కింద ఇళ్లను నిర్మించారని, వాటిలో 4, 5, 6 10 బ్లాక్‌లలోని 144 ఇళ్ల పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని, వెంటనే శిథిలావస్థకు చేరిన ఇళ్లను తొలగించి నూతనంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు స్పందించిన ఆయన త్వరలోనే సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటరమణ, ఐడీహెచ్‌కాలనీకి చెందిన వినోద్, సురేష్, గజ్జెల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో తరగతులు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. బుధవారం అసెంబ్లీ హాలులో ఈ విద్య సంవత్సరం మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా ఐటీ డైరెక్టర్ ప్రొ.బీఎస్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రమం తప్పకుండా తరగతులకు హాజరుకావాలని ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ ఈ సందర్భంగా విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్ టీకే కృష్ణ, వెంకట్, విష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ దూరవిద్యలో 10 లక్షల మంది విద్యాభ్యాసం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రంలో ఇంత వరకు 10 లక్షలకు పైగ విద్యార్థులు విద్యాభ్యాసం చేసినట్లు డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి తెలిపారు. నాటి వీసీ ప్రొ.జి రామిరెడ్డి 1977లో స్థాపించిన ఓయూ దూరవిద్య కేంద్రంలో తొలుత 20కి పైగా కోర్సులతో ప్రారంభంకాగా ప్రస్తుతం 72 కోర్సులను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఓయూ దూరవిద్య డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక వర్సిటీ, ఇందిరాగాంధీ జాతీయ ఓపెన్ వర్సిటీలతో పాటు దేశంలోని ఇతర దూరవిద్య కేంద్రాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

జిమ్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి



పద్మారావునగర్ పార్కులో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పద్మారావునగర్: ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చక్కని జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. పద్మారావునగర్ పార్కులో బుధవారం జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పని ఒత్తిడికితోడు ఆహారపు అలవాట్లు ...వాతావరణ కాలుష్యం తదితర పరిస్థితుల కారణగా పట్టణ ప్రాంతంలోని ప్రజల్లో శారీరక శ్రమ తగ్గిపోవడం కారణంగా ప్రజలు అనేక రకాల అనారోగ్య సమస్యలకు లోనవుతున్నారన్నారు. బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాలను కాపాడి వాటికి ఆటస్థలాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మామిడి బాల్‌రెడ్డి, నాయకులు ఈసీ రావు, క్రిష్ణారావు, విజయ్, జీకే రావు, లాయక్‌లతో పాటు బీజేపీ నాయకులు టి. రాజశేఖరరెడ్డి, హరినాథ్, ఖండెల్వాల్, శ్రీశైలం, శ్యాంసుందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టండి



జెడ్‌సీ రవికిరణ్‌కు వినతపత్రం సమర్పిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

లాలాపేట: లాలాపేటలోని ప్రొ.జయశంకర్ స్టేడియంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జెడ్‌సీ రవికిరణ్‌ను బుధవారం కోరారు. ఈ మేరకు ఆయకు వినతిపత్రం సమర్పించారు. లాలాపేటలోని స్టేడియంలో అనేక సమస్యలు ఉన్నాయని, పలుచోట్లు గోడలకు పగుళ్లు పట్టి కూలిపోయే స్థితికి చేరుకున్నాయన్నారు. అంతే కాకుండా మద్యం తాగడం వంటి కార్యకలాపాలకు కూడా పలువురు పాల్పడుతున్నారని చెప్పుకొచ్చారు. స్టేడియంలో మరమ్మతులు చేసి అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు మహేష్, ధన్‌రాజ్, భాస్కర్‌గౌడ్, సుబ్బారాయుడు,, రవి, కిషోర్ యాదవ్, సుజన్, మున్నలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



సనత్‌నగర్: నాగరాజరాజేశ్వరీనగర్‌లో కొలువుదీరిన నాగరాజరాజేశ్వరిదేవి ఆలయ 32వ వార్షిక వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొలను బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపారు. మధ్యాహ్నం దాదాపు 800 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దాడి ప్రవీణ్‌రెడ్డి, రాజు, పీయూష్‌గుప్తా, బుచ్చిలింగం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను బాగుచేయండి



పాడైపోయిన రోడ్ల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు



సనత్‌నగర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, దీంతో రాకపోకలు సాగించాలంటే జనం ఇబ్బందులు పడుతున్నారంటూ బీజేపీ నేతలు ఆందోళన నిర్వహించారు. సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సందర్శించి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బస్టాండ్ నుంచి సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వరకు వేసిన డివైడర్ లైన్ ముందు భాగం దెబ్బతిన్నాయన్నాయన్నారు. అలాగే శ్రీనివాస్ భవన్ నుంచి హనుమాన్ దేవాలయం రోడ్డు, కూరగాయల మార్కెట్ రోడ్డు, సుభాష్‌నగర్ నుంచి జయభారతి రోడ్డు..ఇలా డివిజన్‌లో చాలాచోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగరావు, లక్ష్మీనారాయణ, ఆకూరి శ్రీనివాస్, సిర్మనీ నరేష్, సుధాకర్‌ముదిరాజ్, ఆనంద్, వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.